క్లుప్తంగా

భక్తులకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శుభాకాంక్షలు

నరసరావుపేట: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మహాశివరాత్రి శుభాకాంక్షలు శుక్రవారం తెలిపారు. పలనాడు జిల్లా కేంద్రంగా నరసరావుపేట అవతరించిన తర్వాత నిర్వహిస్తున్న కోటప్పకొండ తిరునాళ్లను మనందరికీ ప్రత్యేకమైందన్నారు. ఈ ఏడాది కోటప్పకొండకు వచ్చే భక్తులకు అడుగడుగునా ఆధ్యాత్మికతను లోనయ్యేలా ఏర్పాటు చేశామన్నారు. త్రికోటేశ్వరస్వామి ఆశీస్సులతో పలనాడు పచ్చగా ఉండాలని, పాడిపంటలతో రైతులు ఆనందంగా ఉండాలని, విద్యా, వైద్య, వ్యాపార రంగాలు మరింతగా విస్తరించి నరసరావుపేట అన్నిరకాలుగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. అలాగే తిరునాళ్లకు వచ్చేవారు ఆధ్యాత్మికతతో దర్శించుకోవాలని కోరారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపీపీ



వినుకొండ(నూజెండ్ల): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీపీ మేడం జయరామిరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణమ్మ, పాఠశాల పీఎంసీ చైర్మన్ ఒంగూరి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నకిలీ స్వాములు



ఈపూరు: మాయ మాటలు చెప్పి అంత్రాలు వేస్తామంటూ ఇంట్లో ఎవరు లేని సమయంలో మహిళలను భయభ్రాంతులకు గురి చేస్తున్న స్వామిమాల ధరించిన ఇరువురిని గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బెల్లంకొండ ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కాషాయ వస్త్రాలు ధరించి వచ్చారు. శుక్రవారం మండలంలోని ఊడిజర్ల గ్రామానికి వచ్చి మీ ఇంట్లో పరిస్థితి బాగలేదని, ఆర్థిక పరిస్థితి, ఆరోగ్య పరిస్థితులు బాగోలేవని పూజలు చేస్తామని చెప్పి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో కూర్చొని మహిళలకు మాయమాటలు చెప్పి పూజల్లో కూర్చోబెట్టారు. బీరువాలో ఎంత నగదు ఉన్నదో తీసుకురావాలని చెప్పి వారిని బెదిరించినట్లు మాట్లాడారు. ఇదే తంతు చుట్టుపక్కల ఇళ్లల్లో కూడా జరగడంతో అందరూ మూకుమ్మడిగా ఆ ఇంటి వద్దకు వచ్చి ఆ ముగ్గురిని పట్టుకునే సమయంలో ఒక వ్యక్తి పారిపోయాడు. మిగతా ఇరువురిని పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. అయితే పోలీసులు వారి బంధువులను పిలిపించి మాట్లాడిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

భక్తుడి మృతి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చిన భక్తుడు గుండెజబ్బుతో మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నరసరావుపేట పట్టణానికి చెందిన బ్రహ్మయ్య త్రికోటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు కొండకు వచ్చాడు. అయితే గుండె జబ్బు గల బ్రహ్మయ్య తీవ్ర అస్వస్థతకు గురై పడిపోయాడు. గమనించిన పోలీసులు అతడిని స్థానిక ప్రాథమిక వైద్యశాలకు తరలించగా వైద్యులు వెంకటేశ్వర్లు చికిత్స చేశారు. పట్టణానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా మృతి చెందినట్లు డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

నిరుపయోగమైనవి తొలగించండి

నాదెండ్ల: వచ్చే ఉగాది నాటికి ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మిషన్ శోభాకృత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ వెల్ఫేర్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులు, వృథాగా ఉన్న ఫర్నీచర్, వాహనాలు వగైరాలను తొలగించాల్సి ఉందన్నారు. వీటిని బహిరంగ వేలం నిర్వహించి, తద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఏవీ రమణ, ఎంఈవో ఆంజనేయులు, సీడీపీవో శాంతకుమారి, ఏవో హరి ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

టెస్టు పేపర్ల పంపిణీ

చిలకలూరిపేటటౌన్: పదో తరగతి విద్యార్థులకు ఫైనల్ ఎగ్జామ్‌లో మోడల్ టెస్టు పేపర్లు ఎంతగానో ఉపయోగపడతాయని వినుకొండ ఏపీపీ డి వెంకటేశ్వర్లు చెప్పారు. శుక్రవారం జ్ఞానస్వరీ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్ పదో తరగతి విద్యార్థులకు ఏడు సబ్జెక్టులకు సంబంధించి టెస్టు పేపర్లు, పరీక్షా ప్యాడ్లు ఉచితంగా పంపిణీ చేశారు.


వస్తున్నామయ్యా..కోటయ్యా

త్రికూటాచలానికి ప్రభలు బయలుదేరాయి. దాదాపుగా నెలరోజులుగా ప్రభ నిర్మాణంలో భాగస్వాములైన పలువురు గ్రామస్తులు శుక్రవారం నాటికి సిద్ధం చేశారు. ముందుగా పూజలు నిర్వహించి, బలిహరణలు చేసి, నిమ్మకాయలు, కొబ్బరికాయలతో దిష్టి తీసి 'చేదుకో కోటయ్యా' అంటూ శివయ్య నామస్మరణ చేసుకుంటూ తరలివెళ్లారు. మూడు నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రభలు కొండకు సాగిపోవడం కనిపించింది.

- కోటయ్య సన్నిధికి తరలిన భారీ ప్రభలు
- నేడు త్రికోటేశ్వరుని సన్నిధికి చేరిక
- సాయంత్రం విద్యుత్‌కాంతులతో వెలిగిపోనున్న ప్రభలు



ప్రభకు ఏర్పాటు చేసిన ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి రజిని



కొండకు తరలివెళ్తున్న అమీన్ సాహెబ్‌పాలెం గ్రామ ప్రభ



అప్పాపురం గ్రామ ప్రభ వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు



ఉప్పలపాడు సమీపంలో విద్యుత్ ప్రభ

చిలకలూరిపేట: భక్తిశ్రద్ధలతో ప్రభలు కట్టి కోటయ్యస్వామిని దర్శించేందుకు భక్తులు శుక్రవారం తరలి వెళ్లారు. భారీ విద్యుత్ ప్రభలు కట్టి చేదుకో కోటయ్య మమ్మాదుకో కోటయ్య అంటూ కోటప్పకొండకు పయనమయ్యారు. తిరునాళ్లకు ప్రభలను నిర్మించటం మనదైన, అరుదైన సంప్రదాయం. ఎన్నో ఏళ్లుగా అది కొనసాగుతూ వస్తోంది. భారీ ప్రభలకు కోటప్పకొండ తిరునాళ్ల పెట్టింది పేరు. మహాశివరాత్రికి లక్షలు వెచ్చించి ప్రభలు కట్టి శివనామస్మరణ చేస్తూ కొండకు వెళ్లటం ఆనవాయితీగా వస్తోంది. పట్టణ పరిధిలోని పురుషోత్తమపట్నం నుంచి ఏకంగా 10 ప్రభలు కట్టారు. ఇందులో ఆరు భారీ విద్యుత్ ప్రభలు. ప్రభల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం కొండ జాతరకు తరలారు. ఈ పూజల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పాల్గొనటంతో పాటు ప్రభకు ఏర్పాటు చేసిన ఎడ్లబండిని తోలి సందడి చేశారు. వివిధ గ్రామాల నుంచి ప్రభలు తరలివెళ్లాయి.



పోట్లూరులో నందిశ్వరుడుతో ఊరేగింపునకు సిద్ధం చేసిన విద్యుత్ ప్రభ

నాదెండ్ల నుంచి...

నాదెండ్ల: హరహరో... చేదుకో కోటయ్య చేదుకో అంటూ భారీ ప్రభలు ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండకు శుక్రవారం తరలాయి. మండలంలోని అప్పాపురం, అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామ ప్రభలకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామం చివరి వరకూ సాగనంపారు. ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఇనుపగాండ్ల వాహనాలపై ఏర్పాటు చేసిన ప్రభలను గ్రామాల నుంచి 14 కిలోమీటర్ల దూరంలో గల కోటప్పకొండకు తరలించారు. ఒక్కో ప్రభ వద్ద వెయ్యి మంది కార్యకర్తలు తరలివెళ్లారు. శనివారం ఉదయం 10 గంటలకు యూటీ సెంటర్ నుంచి త్రికోటేశ్వరుని సన్నిధి వద్ద కేటాయించిన స్థలాలకు చేరుకుంటాయి. అనంతరం విద్యుత్ లైటింగ్‌లను ప్రభలకు అలంకరించనున్నారు. రాత్రి దేదీప్యమానమైన విద్యుత్ కాంతులతో ప్రభలు వెలిగిపోనున్నాయి. సుమారు నెలరోజులుగా ప్రభల నిర్మాణానికి ఆయా గ్రామాల ప్రజలు శ్రమించారు. గత అర్థశతాబ్దం నుంచి భారీ ప్రభలను సిద్ధం చేసి కోటయ్య సన్నిధికి తరలించటం ఆనవాయితీగా వస్తుంది.

శావల్యాపురం మండలం నుంచి...

శావల్యాపురం: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని పోట్లూరు, కొత్తలూరు గ్రామాల్లో కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా కొన్ని సంవత్సరాలుగా మొక్కుబడి విద్యుత్ ప్రభలు గ్రామస్తులు ఏర్పాటు చేయటం ఆనవాయితీగా వస్తుంది. శుక్రవారం సాయంత్రం విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి గ్రామపురవీధుల్లో ఊరేగించి తిరునాళ్ల పర్వదినం రోజున ఇరు గ్రామాల్లోని వారందరు పార్టీలకు కులమతాలకు అతీతంగా ట్రాక్టర్లపై మేళతాళాల నడుమ ప్రభలను తరలిస్తారు.

ఉప్పలపాడు నుంచి....

నరసరావుపేట రూరల్: మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన విద్యుత్ ప్రభ శుక్రవారం కోటప్పకొండకు బయలుదేరింది. ఉదయం ప్రభకు పూజలు నిర్వహించిన అనంతరం కొండకు తరలించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని తెలగ సంఘం ఆధ్వర్యంలో గత 14 సంవత్సరాలుగా విద్యుత్ ప్రభను ఏర్పాటు చేస్తున్నారు. సంఘీయులు అందరూ కలిసి కట్టుగా ప్రభను అనుసరించారు. మహిళలు సైతం ప్రభ తాళ్లు పట్టుకుని ప్రభ వెంట నడిచారు. ఉప్పలపాడు-గురవాయపాలెం గ్రామాల మధ్య రెండు చోట్ల హైటెక్షన్ విద్యుత్ వైర్లు ఉండటంతో ప్రభను వెనక్కు వంచి ముందుకు కదిలారు.

చిట్టి ప్రభలు..

నరసరావుపేట ఈస్ట్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి ఆలయం వద్ద జరగనున్న తిరునాళ్లను సందర్భంగా కోటయ్యస్వామిని దర్శించుకునేందుకు చిన్నారులు ప్రభలతో తరలివెళ్లనున్నారు. ప్రభలను అందంగా అలంకరించుకొని చేదుకో కోటయ్య.... చేదుకో... అంటూ పట్టణం నుంచి 11 కిలోమీటర్ల దూరంలోని కోటప్పకొండకు నడుచుకుంటూ వెళ్లనున్నారు. చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా కుటుంబసభ్యులు అందరూ అన్నపానీయాలతో ప్రభ వెంట కొండ చేరుకొని త్రికోటేశ్వరుని దర్శించుకొని వస్తారు. పాలపాడురోడ్డు ఎంప్లాయిస్ కాలనీకి చెందిన జైగణేష్ ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు గుదే రాంబాబు, రంగు నాగశివప్రసాద్, రవికిరణ్, నల్లపాడు నాగేశ్వరరావు, రాధాకృష్ణమూర్తి తదితరులు కొండ పండుగ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 11 అడుగుల ఎత్తుతో చాక్లెట్లతో ప్రభను తయారుచేశారు.



విద్యుత్‌కాంతుల నడుమ గరళకంఠుడు



చిన్నారుల మొక్కుబడి ప్రభ



చాక్లెట్లతో అలంకరించిన ప్రభ

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: మహాశివరాత్రి కోటప్పకొండ తిరునాళ్లను పురస్కరించుకొని సర్వం సిద్ధమైంది. చిలకలూరిపేట పరిసర ప్రాంతాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి స్వామి తిరునాళ్లకు వేళ్లే ప్రయాణికులు అత్యధికం చిలకలూరిపేట పట్టణం మీదుగానే వెళతారు. దీన్ని పురస్కరించుకొని పట్టణంలోని పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు సెంటర్ వేదికగా మారింది. అడ్డరోడ్డు సెంటర్‌లో ఇప్పటికే ఆర్టీసీ తాత్కాలిక బస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం నుంచే ప్రత్యేక బస్సులు కొండవరకు వెళ్లేందుకు అందుబాటులో ఉంచారు. ప్రయాణికుల సౌకర్యార్థం పట్టణం నుంచి కొండదిగువ వరకు 120 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం ఎస్ రాంబాబు తెలిపారు. కోటయ్యస్వామి భక్తుల సౌకర్యార్థం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీతో పాటు వివిధ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు సెంటర్‌లో మంచినీటి చలివేంద్రాలు, అల్పాహార కేంద్రాలు, ఏర్పాటు చేశారు. భక్తులకు స్వాగతం పలుకుతూ పెద్ద ఎత్తునఫ్లెక్సీ బ్యానర్లు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వివిధ స్టేషన్ల నుంచి అదనంగా పోలీసు సిబ్బందిని రప్పించారు. ఇప్పటికే చెరుకుగడల విక్రయ కేంద్రాలు,పిల్లల ఆట వస్తువుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు ముస్తాబయ్యాయి. చౌత్రసెంటర్‌లోని శ్రీ గంగా పార్వతీ సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకొని ఉదయం 4 గంటలకు సుప్రభాతసేవతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రెండు ఆలయాలలో చోరీ

రొంపిచర్ల: మండలంలో అలవాల, అచ్చయ్యపాలెం గ్రామాల మధ్యగల ముత్యుంజయపురం వద్ద గల ప్రసన్నాంజనేయస్వామి, షిర్డీ సాయిబాబా ఆలయాలలో దొంగతనం జరిగిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గురువారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగింది. ఈ సంఘటనలో సుమారు రూ.2.35 లక్షల రూపాయల విలువైన వస్తువులు అపహరణకు గురైనట్లు ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు. ఆయా గ్రామాల మధ్య గల రెండు ఆలయాలల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఈ సంఘటనకు పాల్పడినట్లు వారు తెలిపారు. పొలాలకు వెళ్లిన రైతులు ఆయా ఆలయాలలో చోరీ జరిగిన సంఘటన గుర్తించి ఆయా గ్రామస్తులకు సమాచారం తెలిపారు. విషయం తెలుసుకున్న ఆయా గ్రామస్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు వద్దకు వచ్చారు. శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో సీసీ కెమెరాలు, మైక్‌సెట్, గ్యాస్ పొయ్యి, సిలిండర్లు చోరీకి గురైనాయి. అదే విధంగా శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో హుండీని పగులగొట్టి అందులో రూ.30,000 రూపాయలు నగదు అపహరణకు గురైనట్లు ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనలో ఆయా గ్రామాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు రొంపిచర్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.



మైక్‌సెట్‌కు సంబంధించిన వస్తువులు అపహరించిన దుండగులు

మహాశివరాత్రికి ముస్తాబైన ఆలయాలు



వినుకొండ(నూజెండ్ల): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శైవ ఆలయాలు ముస్తాబయ్యాయి. వినుకొండ కొండపై వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయం, పాత శివాలయం, మంజునాథ ఆలయం, కామాక్షి కమలేశ్వర ఆలయాలతో పాటు పలు దేవాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. హిమాలయ గురువు ఆధ్వర్యంలో విఠంరాజుపల్లి సమీపంలోని చిన్నషిరిడీలో మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నూజెండ్లలో....

నూజెండ్ల, రవ్వవరం శ్రీ వెంకటేశ్వర జగన్మాత పీఠం, తలార్లపల్లి సోమేశ్వర ఆలయం, అప్పాపురం కాశీవిశ్వేశ్వర ఆలయం, ములకలూరు, పమిడిపాడు గ్రామాల్లో మహాశివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయాల్లో భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన ఏర్పాట్లు చేశారు.

విజిలెన్స్ తనిఖీలు

నాదెండ్ల: మినరల్ వాటర్ ప్లాంట్లపై రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ సీఐ లక్ష్మారెడ్డి, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి లక్ష్మణనారాయణ, మెట్రాలజీ అధికారి అల్లూరయ్య వాటర్ ప్లాంట్లపై తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా పొందాలని, నిబంధనలు తూచ తప్పక పాటించాలన్నారు. ప్రతి ప్రొడక్ట్‌లపై తయారీదారుల అడ్రస్సు, ఉత్పత్తి చేసిన తేదీ, ఎక్స్‌పైరీ తేదీ, ఎమ్మార్పీ ధరలు ముద్రించాలన్నారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, సాధారణ తనిఖీల్లో భాగంగా ప్లాంట్లను పరిశీలించినట్లు చెప్పారు.

నేడు మన్నేపల్లిలో తిరునాళ్ల



మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

బొల్లాపల్లి: నల్లమల అటవీప్రాంతంలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దు పరిధిలోని బొల్లాపల్లి మండలం మన్నేపల్లి తండా సమీపంలో అటవీప్రాంతంలో స్వయంభువుగా వెలసిన మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల నేడు వైభవోపేతంగా జరగనుంది. మహాశివరాత్రి పర్వదినం రోజున శివాలయాల్లో శివనామస్మరణతో మార్మోగుతుంటే ఈ ప్రాంతంలోని మన్నేపల్లయ్య దేవాలయంలో వెంకటేశ్వర స్వామి కల్యాణం రమణీయంగా, కనుల విందుగా నిర్వహిస్తారు. ప్రతిఏటా మహాశివరాత్రి పర్వదినాన మన్నేపల్లి నరసింహ స్వామి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. కొండపై కొలువు దీరిన మన్నేపల్లి స్వామిని మన్నేపల్లయ్యగా కొలుస్తారు. ఈ దేవాలయంలో మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి, వెంకటేశ్వర స్వామి దేవతామూర్తులతో పాటు ఆదిలక్ష్మి అమ్మవారు, ఆలయ ప్రాంగణంలో శివలింగం, ఆంజనేయస్వామి, గరుత్మంతుడు, విశ్వేక్సేనుడు, విఘ్నేశ్వరుడు, కుమారస్వామి, పార్వతీదేవి, వీరభద్రుడు, సీతారాములు, లక్ష్మణుడు, నందీశ్వరుడు, నాగేంద్రుడు విగ్రహాలు కొలువై ప్రతిష్ఠించారు. రెండు జిల్లాలకు చెందిన చుట్టుపక్కల గ్రామాల నుంచి తిరునాళ్ల రోజున భక్తులు స్వామి కల్యాణం వీక్షించేందుకు తండోపతండాలుగా తరలివస్తుంటారు. రాకపోకలకు మాచర్ల, వినుకొండ, ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని మార్కాపురం డిపోల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు, తిరునాళ్లకు సర్వం సిద్ధమని ఆలయ కార్యనిర్వహణ అధికారి బి.శ్రీనివాసులు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు పోషకాహారం పంపిణీ

శావల్యాపురం: మండలంలోని ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నెలరోజుల పాటు పోషకాహారం పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో మద్దికుంట సాంబశివరావు శుక్రవారం తెలిపారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఈవో మాట్లాడుతూ ఒక్కో విద్యార్థికి రూ. 7 రూపాయల 50 పైసలు చొప్పున ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రతిరోజు సాయంత్రం పోషకాహారంలో భాగంగా అరటిపళ్లు, గుగ్గిళ్ళు, శనగ పప్పు ఉండలు, తదితర పోషకాల కల్గిన ఆహారాన్ని క్రమం తప్పకుండా ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పారదర్శకంగా 268 మంది విద్యార్థులకు పంపిణి చేయాలన్నారు. మతుకుమల్లి-28, కారుమంచి-49, వేల్పూరు-56, పోట్లూరు-47, శావల్యాపురం హైస్కూల్లో విద్యార్థులు 87 మంది విద్యార్థులు ఉండగా అందులో బాలికలు -139, బాలురు-129 మంది ఉన్నట్లు ఎంఈవో చెప్పారు. ఆయనతో పాటు సీఆర్‌పీ రాపూరి శివప్రసాదు, శ్రీహరి, ఉన్నారు.